పనిచేస్తూ ఉంటే, నన్ను ప్రేమిస్తూ ఉంటే, మీ మనస్సు నాచుట్టూ తిరుగుతూ ఉంటే అప్పుడు నా స్వరూపం పొందుతారు అన్నాడు పరమాత్మ. స్వార్థం లేకుండా పని చేయటం భగవంతుడిని ప్రేమించటం అంత తేలిక కాదు. అది చేసేటప్పుడు తెలుస్తుంది. గొయ్యి ఎంత లోతు ఉందో దిగితేనేగాని తెలియదు. మనం నిజంగా ప్రేమిస్తున్నామా లేకపోతే ప్రేమిస్తున్నట్టు నటిస్తున్నామా? మీరు చదువులు చదివేస్తే నామీద ప్రేమ కలుగుతుందా? అసలు మీ స్వభావం ఎలా ఉందో చూసుకోండి. మీ స్వభావాన్ని బట్టి మీరు మాట్లాడతారు, మీ స్వభావాన్ని బట్టి మీరు పనులు చేస్తారు, మీ స్వభావాన్ని బట్టి మీరు ప్రేమిస్తారు. ముందు ఆ స్వభావాన్ని మార్చుకోండి. విషయచింతన మన స్వభావం. దైవాన్ని చింతించటం మన స్వభావం కాదు. తేలు కుడుతుంది, పాము కరుస్తుంది అది దాని స్వభావం అలాగే విషయ చింతన మనకి స్వభావం. నువ్వు నీ స్వభావాన్ని మార్చుకుంటేగాని నన్ను ప్రేమించలేవు, నాకోసం పనిచేయలేవు, నీ మనస్సులో ఉన్న ఆలోచనలు నా చుట్టూ తిరగవు అంటున్నాడు పరమాత్మ. భగవద్గీతలో చెప్పిన విషయం మీరు ఆచరణలోనికి తెచ్చినప్పుడు అందులో ఉన్న కష్టం మీకు తెలుస్తుంది. అప్పటిదాకా మీకు తెలియదు. ఒకవేళ మీలో ఏమైనా దోషాలు, బలహీనతలు ఉన్నా మీరు కంగారుపడకండి, తొందరపడకండి. దేరీజ్ ఈశ్వర. పెద్ద గడ్డిమేటుకూడా చిన్న అగ్గిపుల్లవేస్తే తగులబడిపోతుంది. అలాగే మీలో ఎన్ని బలహీనతలు, ఎన్ని దోషాలు ఉన్నప్పటికీ నా అనుగ్రహం వలన అన్నీ పోతాయి. మీ హృదయంలో ఉన్న బండ రాళ్ళని బయటికి లాగిపడేసే వాడిని నేను ఉన్నాను. భరించేవాడిని నేను ఉండగా మీకు ఎందుకు భయం అంటున్నాడు పరమాత్మ.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-07-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏ పనులు ఎలా చేయాలి అని నేర్చుకొంటున్నాము అలాగే మన దేహం చనిపోయేటప్పుడు ఎలాగ చనిపోవాలి అనేది మనం నేర్చుకోవాలి. ఇప్పుడు మనం దేహంతో తాదాత్మ్యం పొందుతున్నాము, మనస్సుతో తాదాత్మ్యం పొందుతున్నాము, విషయాలతో తాదాత్మ్యం పొందుతున్నాము. అవన్నీ నిజాలుకాదు. దేహానికి చావు వచ్చే రోజుకైనా వాటితోటి తాదాత్మ్యం వదులుకోవాలి. మన శరీరాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకొన్నా అది ఏదోరోజున చనిపోతుంది. అది దాని స్వభావం. కాని మరణంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. అది ఒక్కటే నిజం, మిగిలినవన్నీ తలంపులే. చనిపోవటం నేర్చుకోవటం అంటే దేహం చనిపోయే రోజుకైనా ఈ చనిపోయే దేహం నేనుకాదు, మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువే నేను అని ఆ సద్వస్తువుతో మనకు తాదాత్మ్యం రావాలి, అదే నిజమైన మరణం, అదే కడసారి జన్మ. హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతో తాదాత్మ్యం పొందిన తరువాత నీ శరీరం చనిపోతూ ఉన్నా నేను చనిపోతున్నాను అనే భావన నీకు రాదు. ఇప్పుడు శరీరం ఉన్నప్పుడు

నువ్వు ఎలాగ ఉన్నావో అలాగే శరీరం పోయిన తరువాత కూడా నేను ఉంటాను అని ప్రాక్టికల్‌గా నీకు తెలుస్తూ ఉంటుంది. ఆ ఉండటం అనేది మనకు అనుభవంలోనికి రావాలి. ఏవో పుస్తకాలు చదవటంకాదు మన హృదయంలో ఉన్న సద్వస్తువుతో మనకు తాదాత్మ్యం రావాలి. గాంధీగారిని కాల్చి చంపినప్పడు హేరామ్, హేరామ్, హేరామ్ అని ఆత్మారాముడితో తాదాత్మ్యం పొంది చనిపోయాడు అంటే డయ్యింగ్ నేర్చుకున్నాడు. గాంధీగారు చనిపోయేటప్పడు రాజగోపాలాచారి ఏమన్నారు అంటే నౌ హి బికేమ్ ఇమ్మోర్టల్ అన్నాడు.

గోవిందుడిని తెలుసుకోవటానికి అనేక మార్గాలు ఉన్నాయి. అందులో భక్తిమార్గం గొప్పది. నువ్వు బాగుపడటానికి భక్తి మార్గం చాలు. నువ్వు భక్తి మార్గాన్ని విడిచిపెట్టకుండా అందులో సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తూ ఉంటే ప్రపంచంలో ఎవ్వరికీ లేని చెడ్డ వాసనలు నీలో ఉన్నా అవి అన్నీ పోతాయి, భక్తికి అంత శక్తి ఉంది, నువ్వు నిర్వాణసుఖం పొందటానికి భక్తిమార్గం సరిపోతుంది, నీలో ఉన్న చెడువాసనలను బయటకులాగి కాల్చి బూడిదచేసే శక్తి భక్తిమార్గానికి ఉంది అని రామకృష్ణుడు చెప్పేవారు. ఆయనకు ఎవరైనా భక్తులు లగ్జరీ వస్తువులు, శాలువాలు వంటివి ఇస్తే నేను అలౌకికుడినిరా, నన్ను లౌకికుడిని చెయ్యవద్దురా బాబూ అనేవారు.

**వినరాబాబూ, అనరాబాబూ గోవిందుడే గురువు, గురువే గోవిందుడు అని వినరాబాబూ అనరాబాబూ**
**దుస్సాంగత్యం విడిచిపెట్టు, సత్సాంగత్యం చెయ్యరాబాబూ వినరాబాబూ అనరాబాబూ**
**దుర్వాసనలు పోగొట్టుకోరా సద్వాసనలు సంపాదించుకోరా వినరాబాబూ అనరాబాబూ**

అని రామకృష్ణపరమహంసగారు ఆయనలో ఆయన పాటలు పాడుకొనేవారు. వినరాబాబూ అనరాబాబూ అంటే నేను చెప్పిన మాటలు విని ఇంటికి వెళ్ళి స్మరించుకో అని చెప్పటం. నీకు ఎన్ని దుర్వాసనలు ఉన్నా భయపడకు సత్సాంగత్యం చేస్తే అన్నీ పోతాయి. నువ్వు బాగు పడాలంటే సత్సాంగత్యానికి మించిన ఔషదం లేదు అని చెప్పారు. నేను హైదరాబాద్‌లో మాట్లాడుతూ మన భారతదేశంలో స్పిరిట్యువల్ పీపుల్ చాలామంది ఉన్నారు. రామకృష్ణుడిది నేకెడ్ స్పిరిట్యువాలిటీ అని చెప్పాను. అక్కడ ఒక రిటైర్డ్ ఇంగ్లీషు ప్రొఫెసరు ఉన్నారు. మీటింగు అయిన తరువాత ఆయన నా దగ్గరకు వచ్చి మేము వంశపారంపర్యంగా రామకృష్ణుడి భక్తులము. ఆయన సాహిత్యం చాలా చదివాను కాని నేకెడ్ స్పిరిట్యువాలిటీ అనేది మీ నోటి నుండే వింటున్నాను ఇంతకు ముందు ఎక్కడా చదవలేదు, వినలేదు అని చెప్పారు. ఆయనలో నేను సంతోషించేది ఏమిటి అంటే రామకృష్ణుడిలో కపటంలేదు, అసలు లౌక్యంగా మాట్లాడటం ఎలా ఉంటుందో ఆయనకు తెలియదు. ఆయన ఎటువంటి పనులు చేసేవాడు అంటే ఒకసారి నలుగురు ఆడవాళ్ళు వచ్చి ఆయన దగ్గర కూర్చున్నారు. ఆయన వెళ్ళి వారి మధ్య కూర్చున్నారు, వారు లేవలేదుకాని కొంచెం ప్రక్కకు జరిగి దూరంగా కూర్చున్నారు. ఎందుకు అలా జరిగారు అని రామకృష్ణుడు వారిని అడిగాడు. నేను దేహం లేనివాడిని. దేహం

ఉంటే అది పురుషదేహం అవుతుంది లేకపోతే స్త్రీదేహం అవుతుంది. మీది స్త్రీ దేహంగా చూసుకుంటున్నారు కాబట్టి నేను పురుషదేహంగా మీకు కనిపిస్తున్నాను. అందుచేత ప్రక్కకు జరిగారు. అంటే మీకు బేదబుద్ధి పోలేదు. మీ ప్రక్కన కూర్చోవటానికి నాకు సిగ్గు వేయటం లేదు, నా ప్రక్కన కూర్చోవటానికి మీకు సిగ్గు వేస్తోంది. అంటే మీకు దేహబుద్ధి ఇంకా పోలేదు. ఈ దేహాన్నిబట్టేకదా మీరు నన్ను పురుషుడు అనుకొంటున్నారు. దేహబుద్ధిని మీరు దాటాలి. వారు అలా జరగటంలో ఏమీ పొరపాటులేదు, మామూలుగా ప్రాపంచికంగా చేసే విషయమే అది. ఆయన ఏ స్థితిలో ఉన్నాడో వారికి అర్థమయ్యేలాగ, సబ్జక్టు అర్థమయ్యేలాగ చెప్పటానికి రామకృష్ణుడు అలా చెప్పాడు.

ఇప్పుడు మీరందరూ గాలిపీల్చుకుంటున్నారు. అది మీకు తెలుస్తోంది కదా. కాని మొదటి గాలి ఎప్పుడు తీసుకున్నారో అది మీకు తెలియదు, అలాగే చనిపోయేటప్పుడు ఇదే చివరి శ్వాస అని వాడికి తెలియదు. మీ మరణకాలంలో నన్ను స్మరించుకుంటే నా స్వరూపం మీకు ఇస్తాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. అంటే ఇంకో పది నిమిషాలలో చనిపోతాము అనగా స్మరించుకుంటే కుదరదు. ఆ చివరిశ్వాస పోయేటప్పుడు ఏవాసన మీకు లేకుండా కేవలం గోవిందుడి స్మరణే కనుక ఉంటే అప్పుడు ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. చివరి శ్వాస పోయేటప్పుడు గోవిందుడి ధ్యాస రావటం చాలా కష్టం. ఎందుచేతనంటే మీకు లోక వాసనలు, దేహవాసనలు, శాస్త్రవాసనలు ఏమి ఉన్నా అవే మీకు గుర్తుకు వస్తాయి కాని గోవిందుడు మీకు గుర్తుకురాడు. అంటే గోవిందుడి మీద మీకు భక్తి లేదు అని కాదు, అంతకంటే బలమైన వాసనలు మీలో ఉంటాయి. అవే గుర్తుకువస్తాయి కాని పరమాత్మ మీకు గుర్తుకురాడు. మీరు జీవితం పొడుగునా గోవిందుడి స్మరణ చేసినా చనిపోయే టైములో ఆయన గుర్తుకు వస్తాడు అని చెప్పలేము. ఇంతకంటే బలమైన వాసనలు మీకు ఉండవచ్చు. అందుచేత వాసనాక్షయం అవ్వాలి. వాసనా క్షయం అవ్వాలి అంటే సత్పురుషుల సహవాసం చెయ్యాలి. వాసనాక్షయం అవ్వటానికి ఒక్క భక్తిమార్గం సరిపోతుంది అంటే మిగతా మార్గాలు అనుసరించకూడదు అని కాదు. భక్తిమార్గంలో తేలికగా, సులభంగా మీకు సమస్యలు పరిష్కారం అయిపోతాయి. మాకు వేలాది వాసనలు ఉన్నాయి అని భయపడకండి. గోవిందుడి పాదాలపట్ల మీకు ఉన్న ఆ భక్తిప్రవాహంలో మీకు ఎన్ని వాసనలు ఉన్నా, ఎంత బరువైన వాసనలు ఉన్నా కూడా అన్నీ కొట్టుకొనిపోతాయి.

నీకు ఎన్ని వికారాలు ఉన్నా అన్నీ మనస్సులో ఉన్నాయి. మన ఇంట్లో ఎన్ని ఎలుకలు ఉన్నా ఇల్లు కాలిపోతే అందులో ఉన్న ఎలుకలు అన్నీ కాలిపోతాయి. అలాగే మీ మనస్సులో ఎన్ని బలహీనతలు ఉన్నా ఆ మనస్సును నువ్వు కాల్చి బూడిద చేయగలిగితే ఆ బలహీనతలు అన్నీ కాలిపోతాయి. సాధన బాగా జరగాలి అంటే శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం రెండూ జాగ్రత్తగా కాపాడుకోవాలి. మానసికంగా బాగా ఉన్నామని శరీరాన్ని గాలికి విడిచిపెట్టకూడదు.

శారీరకఆరోగ్యం మానసికఆరోగ్యానికి సహకరిస్తుంది. మానసికఆరోగ్యం శారీరకఆరోగ్యానికి సహకరిస్తుంది. ఈ రెండు ఆరోగ్యాలు బాగా ఉండాలి అంటే మనం తీసుకొనే ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనకు ఒక చెడ్డ అలవాటు ఉంది అనుకోండి. ఆ చెడ్డ అలవాటు ఎందుకు వచ్చింది, ఎప్పుడు వచ్చింది అని రాపాడించుకోకూడదు. ఆ చెడ్డ అలవాటును రిపీట్ చెయ్యటం మానేస్తే దానికి శక్తి పోతుంది. మీకు కడుపునొప్పి వచ్చిందనుకోండి. అది ఎందుకు వచ్చింది అని రోజూ ఆలోచించటం కంటే దానిని పోగొట్టుకోండి. అలాగే మీకు చెడ్డ అలవాటు ఉంటే అది ఎందుకు వచ్చింది అని పదిసార్లు రాపాడించుకోకుండా ఉన్న దానిని పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయండి. నీ కళ్లతో నువ్వు చూసుకో, ఎదుటి వారి కళ్లతో నువ్వు చూసుకోవద్దు. నీ బలహీనతలు నీకు తెలిసినట్లు యితరులకు తెలియవు కదా. నువ్వు మనస్సును పరిశీలన చేసుకో. నీ మనస్సులో ఏమి జరుగుతోంది, ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని పరిశీలన చేసుకో.

రామకృష్ణుడి దగ్గరకు వెళితే ఆయన మూకుమ్మడి మాటలు మాట్లాడడు, స్పెసిఫిక్‌గా మాట్లాడతాడు. నువ్వు ఏవో లోకం సమస్యల గురించి మాట్లాడకు, నీకున్న సమస్య ఏమిటో చెప్పు అంటాడు. రామకృష్ణుడి దగ్గర ఏవో పెళ్లిళ్ల గొడవ వస్తే అక్కడ ఉన్నవాడు ఏమండీ పెళ్లిళ్ళు ఉన్నాయి కాబట్టి పుట్టేవాడు పుడుతున్నాడు. పెళ్లిళ్ల వ్యవస్థ లేకపోతే కొత్తవారు ఈ భూమిమీదకు ఎలావస్తారు అందుచేత పెళ్లిళ్ళు ఉండాలి కదా అన్నాడు. రామకృష్ణుడు ఏమన్నాడంటే నువ్వు పుట్టకముందు ఈ సమాజం ఉందా, లేదా? అలాగే నువ్వు చనిపోయాక ఈ సమాజం ఉంటుందా, లేదా? లోకం గురించి మాట్లాడటానికి అంత పెద్దవాడివా నువ్వు. అటువంటి బుడబుక్కల మాటలు వద్దు. నీకు ఇష్టమయితే పెళ్లిచేసుకో లేకపోతే మానెయ్యి. లోకం గురించి, సంతానం గురించి మాట్లాడకు. అసలు పెళ్లి చేసుకోకుండా నువ్వు ఉండగలవో, లేదో ముందు చెప్పు అన్నాడు. ఉండలేను అనిచెప్పాడు. అయితే పెళ్లిచేసుకో, యిటువంటి పిచ్చిపిచ్చి మాటలు ఎందుకు. అసలు నీకు ఉన్నరోగం ఏమిటో చెప్పకుండా లోకం గురించి, దేవుడిగురించి, సమాజం గురించి మాట్లాడతావు ఏమిటి? యిటువంటి వారినే వంచకులు అంటారు. ఇలా చెప్పటం వలన ఆ మనిషికి బాధకలగవచ్చు, ఒకవేళ వాడికి బాధకలిగినా ఆమనిషి బాగుపడాలి,అదీ ఆయన ఉద్దేశ్యం.

చాలామంది కులంతోటి, డబ్బుతోటి, తెలివితేటలతోటి తాదాత్మ్యం పొంది పాడైపోతున్నారు. మీకు ధనం ఉంటే ఉండనివ్వండి, మేము ధనవంతులం, మేము ధనవంతులం అని అనుకోవద్దు. మీకు చదువు ఉంటే ఉండనివ్వండి, మేము పండితులం అని అనుకోవద్దు. మీరు దేశానికి ఏదైనా సేవ చేస్తే నిర్మలంగా చెయ్యండి అంతేగాని మేము దేశసేవకులం అని అనుకోవద్దు. ఇలా వారు కాని గొడవలతో తాదాత్మ్యం పొంది మనుషులు పాడైపోతున్నారు. అంటే బయటకు నున్నగా కనిపిస్తారు, లోపల కుళ్లిపోతారు.

మన హృదయంలో ఉన్న సద్వస్తువు శాంతిసాగరం, ఆనందసాగరం. అవతారపురుషులు అందరూ కూడా అందులో నుండి వచ్చే కెరటాలే. అవతారపురుషుడైన రాముడు భార్య గురించి కంటి నీరు పెట్టుకొన్నట్లు, కృష్ణుడు అబద్ధాలు చెప్పినట్లు మన పురాణాలలో కనిపిస్తాయి. అంటే ఇక్కడ మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే అవతారపురుషులు ఎప్పుడైతే శరీరం ధరించి వచ్చారో కొన్ని శరీర ధర్మాలు వారికి కూడా తప్పవు. ఆ శరీరం పంచభూతాలతో తయారయ్యింది, ఆ పంచభూతాల ప్రభావం శరీరం మీద ఉంటుంది. ఆ శరీరం అలా రియాక్టు అవుతుంది కాని దానికి మనకు సంబంధం లేదు అని లోపల వారికి తెలుస్తూ ఉంటుంది. అవతారపురుషులు కూడా కంటినీరు పెట్టుకొంటున్నారు అంటే వారు దుఃఖపడుతున్నారు అనికాదు, ఆ టైములో శరీరం అలా రియాక్టు అవుతుంది, అది పంచభూతాల లక్షణం.

చైతన్యం గురించి ఎవరైనా మాట్లాడుతూ ఉంటే శ్రవణం చేయండి, చైతన్యం గురించి వ్రాయండి, మంచిదే అంతమాత్రంచేతనే చైతన్యం మీకు తెలియబడదు. నీవు ఎంత వరకు డిజర్వు అయ్యావు, నీకు ఉన్న అర్హతను బట్టి, నీలోపల ఉన్న పవిత్రతను బట్టి అది నీకు తెలియబడుతుంది. రామకృష్ణుడి గురించి నెహ్రూ ఏమని వ్రాసాడు అంటే దేవుడు ఉన్నాడో లేడో నాకు తెలియదు కాని రామకృష్ణుడు పరమపవిత్రుడు అని చెప్పాడు. ఆయనకు ఏమైనా డబ్బు ఉందా, చదువు ఉందా, ఆస్తులు ఉన్నాయా ఏమీ లేవు. బాహ్యంగా చూస్తే ఆయన ఎందుకు పనికిరానివాడు కాని చైతన్యం ఆయనను వరించింది అంటే అక్కడ యోగ్యత ఉంది అది మనం గుర్తించలేకపోవచ్చు. నీలో అర్హత ఉన్నప్పుడు, యోగ్యత ఉన్నప్పుడు సమాజం గుర్తించినా గుర్తించకపోయినా ఈశ్వరుడు గుర్తిస్తాడు, ఆయన గుర్తించి మిమ్మల్ని ఎక్కడ కూర్చోబెట్టాలో అక్కడ కూర్చోబెడతాడు. ఏసు అంటాడు కొండమీద ఉన్న దీపాన్ని ఎవరికీ కనబడకుండా నువ్వు చేయగలవా? ఒకవేళ నీకు అసూయ ఉన్నంతమాత్రం చేత ఆ దీపాన్ని ఎవరికీ కనబడకుండా ఆపగలవా? నువ్వు చూడలేకపోతే నీకళ్ళు మూసుకో అంతేగాని ఇతరులు చూడకుండా నువ్వు చెయ్యగలవా? ఒక మనిషిని జ్ఞానం వరించినప్పుడు, చైతన్యానుభవం పొందినప్పుడు అది లోకానికి తెలియకుండా నువ్వు చెయ్యగలవా? కొండమీద దీపం పెట్టి ఎవరికీ కనబడకూడదు అంటే కుదురుతుందా. జీవ లక్షణాలు ఎలా పోగొట్టుకోవాలో పరమాత్మ గీతలో చెప్పాడు. కృష్ణుడు చెప్పినమాటలు రామకృష్ణుడికి, రమణమహర్షికి వర్తించవు, అర్జునుడికి వర్తిస్తాయి. అర్జునుడు అంటే జీవుడు. మొన్న అరుణాచలంలో ఎవరో అన్నారు ఏమండీ నాన్నగారు మీరు అంతకష్టపడి చెపుతున్నారు. అర్జునుడు ఉన్నాడు కాబట్టి ఈ గొడవ అంతా వస్తోంది అందుచేత అర్జునుడిని తీసేయమని మీరు భక్తులకు చెప్పండి. అర్జునుడిని తీసేస్తే కృష్ణుడే మిగులుతాడు కదా అంటున్నారు. జీవలక్షణాలు ఉంటే అర్జునుడు, జీవలక్షణాలు పోతే పరమాత్మ. ఉన్నది ఒక్కటే అంటే లోపల

ఉన్న జీవుడిని తప్పిస్తే ఉన్నది దేవుడే. ఆ జీవుడిని తప్పించనంతకాలం దేవుడు మీకు కనబడడు. రామాయణంలో వస్తుంది రాముడు వాళ్ళు ప్రయాణంలో ముందు రాముడునడుస్తూ ఉంటాడు, తరువాత సీత, ఆ తరువాత లక్ష్మణుడు నడుస్తాడు ఇక్కడ లక్ష్మణుడికి పరమాత్మ దగ్గరగానే ఉన్నా కనబడకుండా ఎవరు అడ్డువస్తున్నారు, సీత అడ్డువస్తోంది, ఆవిడే మాయ. అలాగే పరమాత్మ నీ హృదయంలో ఎంతో సన్నిహితంగా ఉన్నా ఆయన కనబడకుండా నీకు జీవుడే అడ్డువస్తున్నాడు, ఆ జీవుడే అర్జునుడు. అందుచేత ఆ అర్జునుడిని తీసేయమని మీ భక్తులకు చెప్పండి. మీకు జీవలక్షణాలు ఉన్నాయి కాబట్టి వాటిని పోగొట్టుకోమని చెప్పవలసి వస్తోంది. జీవలక్షణాలు లేనప్పుడు ఇంక నీకు బోధ ఎందుకు?

మీరు నిరంతరం జపం చేయగలరా, ధ్యానం చేయగలరా, సత్పురుషుల దగ్గర కూర్చోగలరా అంటే కూర్చోలేరు. అందుచేత కొంచం సత్కర్మకూడా చేయండి. సమాజం ఉందని మరచిపోకండి. నువ్వు హద్దులుగా ఉన్నప్పుడు కొంచెం సామాజికస్పృహ ఉండాలి అంటే ఇతరుల కష్టసుఖాలలో కొంత పంచుకోవాలి. అది అయినా నువ్వు గొప్పలకోసం చేయకూడదు, చైతన్యస్థాయి పెంచుకోవటం కోసం చేయాలి. ఇది అర్థం చేసుకోండి. నువ్వు గొప్పలకోసం పనులు చేస్తే గౌరవాలు వస్తాయి కాని జ్ఞానం సున్నా, భగవంతుని అనుగ్రహానికి దూరమైపోతారు. మనం చేసే పని ఎలా ఉండాలి అంటే అది పదిమందికి ఉపయోగపడాలి, ఆ పని వల్ల భగవంతుని దయ మనకు రావాలి. ఇలా రెండు లాభాలు ఉండాలి. జీవుడికి అసాధ్యం ఉంటుంది కాని భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీలేదు అర్జునుడిని చంపటానికి కర్ణుడు ఒక ఆయుధం సంపాదించుకొన్నాడు. యుద్ధం జరిగేటప్పుడు కర్ణుడు ఆయుధాన్ని అర్జునుడి మీదకు విడిచిపెట్టాడు. రథంతోలుతున్నది కృష్ణుడి రూపంలో ఉన్న పరమాత్మ. ఆ ఆయుధాన్ని ఆపుచేయలేము అని ఆయనకు తెలుసు. ఆయుధం వస్తూ ఉంటే రథాన్ని రెండు అడుగులు కిందకు తొక్కేసాడు. ఆయుధం వచ్చి అర్జునుడి కిరీటాన్ని పట్టుకొనిపోయింది. దీని అర్థం ఏమిటి అంటే కంఠం పోవలసింది. కిరీటం పోయింది, అదీ భగవంతుని అనుగ్రహం. నీకు ధుర్యోధనుడితో స్నేహం ఏమిటి అని కర్ణుడిని తిట్టేవారు అప్పుడు ఆయన అనేవాడు నాకు ఏమీ లేనప్పుడు చిన్నరాజ్యం ఇచ్చి దానికి అధికారిని చేసాడు, నన్ను ఎవరూ చూడనప్పుడు వాడు చూసాడు. యింతకాలం స్నేహం చేసి, వాడు నాకు ఇచ్చిన భోగాలు అనుభవించి, వాడు దుర్మార్గుడు అయినప్పటికీ వాడిని ఎలా విడిచిపెడతాను అన్నాడు. వాడు మంచివాడో, చెడ్డవాడో నన్ను కష్టకాలంలో ఆదుకొన్నాడు. ఒకవేళ మీరు అందరు కర్ణుడు చెడ్డవాడు అనుకొంటే అనుకోండి కాని నేను దుర్యోధనుడిని విడిచిపెట్టను అన్నాడు. అదీ స్నేహధర్మం.

పాండవులను కాపాడటానికి కృష్ణుడు కొన్ని అబద్ధాలను చెప్పాడు. ఇప్పుడు నన్ను సత్పురుషుడు అనుకొంటున్నారు. నేను అబద్ధాలు చెప్పినందుకు రేపటినుండి నన్ను చెడ్డవాడు

అని చెప్పుకొంటారు. దానివలన నా గౌరవానికి భంగం కలిగినా కూడా నా గౌరవాన్ని బలి యిస్తాను తప్ప పాండవులు చనిపోతూ ఉంటే మటుకునేను అంగీకరించను. యిందులో పరమాత్మకు స్వార్థం ఏమయినా ఉందా? ఏమీ లేదు అక్కడ సత్పురుషులను రక్షించటం అంతే. మీరు కర్మ చెయ్యండి, ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకోకుండా చెయ్యండి. రామకృష్ణ పరమహంసకాని, శారదామాతకాని ఎవరికైనా భోజనం పెడితే వాడు ధనవంతుడా, పేదవాడా, వీడికి ఈ సహాయం చేస్తే మనకు ఏమి కలిసివస్తుంది అని ఈ రకంగా ఎప్పుడూ ఆలోచించలేదు. మనం అయితే యివ్వటంలో కూడా వ్యాపారమే. ఏదయినా గౌరవం వస్తుంది అంటే పది రూపాయలు ఇస్తారు, గోడమీద పేరు వ్రాస్తాము అంటే పది రూపాయలు ఇస్తారు. ఇది అంతా వ్యాపారమే, అది కూడా కోరికే కదా. కోరికతోటి చేసిన కర్మ నిన్ను బంధిస్తుంది. కోరికలేకుండా కర్మ చేయటం చాలా కష్టం. కీర్తికాంక్ష మరీ చెడ్డది, అది పెద్దజబ్బు. యింక కామక్రోధాలే దానికంటే మెరుగు, వయస్సు పెరిగేకొలదీ కొంత తగ్గుతాయి. కీర్తికాంక్ష తగ్గదు. అది నెంబర్‌వన్ జబ్బు. ఈ రోజు మీకు అన్నం లేకపోతే అన్నంలేదు అనుకుంటున్నారు, బట్టలు లేకపోతే బట్టలులేవు అనుకుంటున్నారు, సంసారం సరిగా నడవకపోతే సంసారంలో ఇబ్బందులు పడుతున్నాము అంటున్నారు. కాని ఇవి అన్నీ మీకు సమకూరినాయి అనుకోండి వెంటనే కీర్తి కాంక్ష వచ్చేస్తుంది. మీదేహం చనిపోయేటప్పడు కూడా అది మిమ్మల్ని విడిచి పెట్టదు. అది కూడా ఒక కోరికే. కీర్తికాంక్ష ఉన్నప్పడు నువ్వు చేసే కర్మ మటుకు యోగం అవ్వదు. మీరు అధికంగా శ్రమపడనక్కరలేదు. మీరు రోజూ చేసుకొనే కర్మనే యోగంగా చేయండి, అప్పడు కర్మబంధం నుండి విడిపోతారు. కర్మయోగం వలన కూడా మీకు భగవదనుభవం కలుగుతుంది. అర్జునుడికి కర్మమార్గం ఇష్టం కాబట్టి కర్మ చేస్తూ కర్మ బంధంలో నుండి విడిపోయి ఎలా తరింపబడాలో ఎక్కువగా పరమాత్మ చెప్పాడు. రామకృష్ణ పరమహంసగారు కర్మమార్గం గురించి చెపుతూ నువ్వు కర్మను బలవంతంగా విడిచిపెట్టవద్దు, చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి, ఆ కర్మే నిన్ను విడిచిపెట్టి వెళ్లిపోయింది అనుకో ఇంక మనకు దాని గొడవ వదిలిపోతుంది, ఇంక ఏ సమస్యలు ఉండవు. మనం పని చేసేటప్పడు చేస్తే ద్వేషంతో చేస్తాము లేకపోతే రాగంతో చేస్తాము. ఇలా రాగద్వేషాలతో చేస్తే ఆ పని నిన్ను బంధిస్తుంది. ఏ పని అయినా మనం రాగద్వేషములు లేకుండా చేస్తే అది నిన్ను అంటదు. ఇంకోటి జ్ఞాపకం ఉంచుకోండి. మనకు ఎక్కడైనా ప్రేమ ఉంది అనుకోండి, అప్పడు ఏదైనా పని చేసినా నెమ్మదిగా చేస్తాము. ఎవడి మీద అయినా ద్వేషం ఉంది అనుకోండి ఆ స్పందన, ప్రతిస్పందన స్పీడుగా వచ్చేస్తుంది.

నువ్వు స్వార్థం లేకుండా, రాగద్వేషములు లేకుండా పని పనికోసమే చేస్తే, ఫలకాంక్ష లేకుండా పని పనికోసమే చేస్తే మహాభయంకరమైన సంసార సముద్రంలో నుండి బయటకు వచ్చేస్తావు. మీ చేతిలో ఉన్న సత్కర్మే నిష్కామంగా చేయమని పరమాత్మ చెపుతున్నాడు. మీరు వేదాలు పురాణాలు చదివేటప్పడు అందులో ఈ లోకానికి వెళితే ఆ భోగం వస్తుంది,

ఆ లోకానికి వెళితే ఈ భోగం వస్తుంది అని ఉంటాయి, మీరు ఆ గొడవలలో పడవద్దు, మీకు అసలు భోగప్రవృత్తి వద్దు. కొంతమంది ధనం పెరిగితే అవసరాలు పెంచుకుంటారు. మీకు ధనం పెరిగితే దాచుకోండి అంతేగాని అవసరాలు పెంచుకోవద్దు, చాలామందిలో ఈ చెడ్డగుణం ఉంటుంది. మీకు నాలుగు ఎకరాలు ఉన్నప్పుడు ఒకరకంగా ఉంటారు, యాభై ఎకరాలు ఉన్నప్పుడు ఒకరకంగా ఉంటారు, కొంతమందికి ఆస్థి పెరిగేకొలది వికారం మాటలు వచ్చేస్తాయి. రమణమహర్షిగారు అటువంటి వారి గురించి వారినోటికి పక్షవాతం వచ్చింది అనేవారు. ఏమీ శ్రమపడకుండా, ఏమీ కష్టపడకుండా వచ్చిన సంపాదన మిమ్మల్ని బాగు చేయదు, ఆ సంపాదన వలన మీ మనస్సులో వికారాలు వస్తాయి, మీరు పతనమైపోతారు.

నీచేతిలో ఉన్నపనిని శ్రద్ధగా చెయ్యి. పనిచేసేటప్పుడు ఫలితం నీకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. జరుగవలసింది జరిగే తీరును, జరుగరానిది జరుగనే జరుగదు, లోకంలో ఏది జరిగినా బెంగపెట్టుకోవద్దు. నువ్వు చేసిన కర్మనుబట్టి ఫలితం రాదు, ఈశ్వరుడి ఆజ్ఞనుబట్టి నీకు ఫలితం వస్తుంది. నీ డ్యూటీ నువ్వు చెయ్యి. ఫలితం తక్కువ వస్తోందని పని విడిచిపెట్టకు. నేను అది చేసాను, నేను ఇది సాధించాను అని చాలా మంది అంటారు. అన్నింటికీ నేను ముందుకు వచ్చేస్తుంది. మనందరం పాడైపోవటానికి ఈ నేనే కారణం. ఈ నేను నిజంకాదు. రాగద్వేషాలు, కామక్రోధాలు ఈ పెంటఅంతా ఈ నేనులో నుండే వస్తున్నాయి. దేహము నేను అనే తలంపులోనే మొత్తం పెంట అంతా ఉంది, దానిని తీసేస్తే ఏమీ లేదు అన్నారు భగవాన్. నేను అనే తలంపును తీసేస్తే నీ హృదయంలో ఉన్న శాంతి సముద్రం పొంగుతుంది. ఈ శాంతిసముద్రంలో నుండే అవతారపురుషులు వస్తున్నారు. అయితే వారికి మనకి తేడా ఏమిటి అంటే మనం బుడగలం, వారు పెద్ద పెద్ద కెరటాలు. బుడగలు ఎక్కడ ఉంటాయి? సముద్రంలోనే ఉంటాయి, కెరటాలు ఎక్కడ ఉంటాయి సముద్రంలోనే ఉంటాయి. రాముడు కృష్ణుడు కెరటాల వంటివారు, మనం బుడగలం. మనం అవ్వటానికి బుడగలం అయినా మనం ఎక్కడ ఉన్నాము సముద్రంలోనే ఉన్నాము అది మరిచిపోకండి. మీరు ఇతరులను పరిశీలించే బదులు మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి. ఇతరులను విమర్శించేబదులు మిమ్మల్ని మీరు విమర్శించుకోండి. ఇతరులలో ఉన్న లోపాలను చూసేబదులు మీలో ఏ లోపాలు ఉన్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. మన శరీరానికి చావు ఏ రోజు వస్తుందో, ఏ గంటలో వస్తుందో మనకు తెలియదు. అందుచేత ఈ శరీరానికి చావు రాక ముందే ఈ శరీరంలో ఉండగానే శరీరంలేని స్థితిని ఎవరైతే పొందారో వాడే నిజమైన సాధకుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 23 | సత్యసాయి నిగమ, హైదరాబాద్, సద్గురు శ్రీ నాన్నగారి పుట్టినరోజు |
| సెప్టెంబర్ | 30 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# సద్గురువు శ్రీనాన్నగారు

భగవాన్ శ్రీరమణమహర్షిచే ఆశీర్వదింపబడి, నేటి భక్తశ్రేణిలో అత్యున్నత గౌరవాన్ని, ప్రేమాభిమానాలను, చూరగొన్న ఆధ్యాత్మిక శక్తిసంపన్నులు, మానవతావాది, ఉదారచరితులు అయిన సద్గురు శ్రీనాన్నగారు మనకు గొప్ప ఆధ్యాత్మిక వరం. శ్రీనాన్నగారి జీవితవిధానం భగవాన్ శ్రీరమణమహర్షి బోధతోనూ, భగవద్గీతా సారంతోనూ, నిండి 'నేను'కు నిజమైన అర్థంగా నిలుస్తోంది! జ్ఞానభాస్కరుడైన శ్రీనాన్నగారు తమ ప్రవచనాల ద్వారానూ, రమణభాస్కర మాసపత్రికద్వారానూ, మనకందించే నిర్మల ఆకాశధారవంటి తత్త్వబోధ మనలో జ్ఞానాంకురాన్ని వృద్ధిచేసి, మోక్షఫలాన్ని అనుగ్రహిస్తుంది. బొగ్గుగనిలో వజ్రం లభించడం ఎంత దుర్లభమో, ఈ మాయా ప్రపంచంలో మహాత్ములు లభించడం అంతే దుర్లభం, అట్టి మహాత్ముడే సద్గురు శ్రీనాన్నగారు. గుర్వనుగ్రహాన్ని సింహంతో పోలుస్తారు, ఏనుగు ఒక్క సింహానికి తప్ప మరెవ్వరికీ భయపడదు, అట్లే మన అహంకారం ఒక్క గుర్వనుగ్రహానికే లొంగుతుంది. అట్టి అనుగ్రహం వల్ల మనస్సు దాని మూలమైన హృదయంలో నశించి నేనెవరో? తెలియబడుతుంది. సద్గురు శ్రీ నాన్నగారు ప్రధానంగా అంతరంలోని పరివర్తన మీద గురిపెట్టి, అనేక మంది జీవితాలలో మార్పు తీసుకొస్తూనే ఉన్నారు. మన సాధనా జీవితంలో ఎదురయ్యే అవరోధాలను తొలగించి, మోక్ష ప్రస్థానాన్ని సుగమం చేస్తూ, ప్రతిక్షణం మార్గదర్శిగా నిలుస్తూ, అంతిమ సత్యంలోకి మేల్కొనుటకు ఆయన చేసే కృషి అమూల్యం. పరమశాంతియే స్వరూపం, శాంతియే గురువు, శాంతియే దైవం, అని బోధిస్తూ స్వరూప ఎరుక మీద గురిపెట్టే శ్రీనాన్నగారి చూపు, మాట, స్పర్శ ఎంత మధురమంటే మరల మరల వారి పాదాల చెంతకు చేరాలనిపిస్తుంది. అట్టి గురువుపట్ల అచంచల విశ్వాసంతో వారి బోధను ఆచరించి తరించడమే మన కర్తవ్యం.

**(ది॥ 23-09-2012 సద్గురు శ్రీనాన్నగారి పుట్టినరోజు సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి**, అమలాపురం

# జీవించి ఉన్న గురువు మనకు మహాసామీప్యంలో ఉంటారు

వాస్తవంలో గురువుపట్ల మనకున్న భక్తి, ప్రేమ, గౌరవం వల్లనే మనం మన జీవితాన్ని సక్రమపద్ధతిలో జీవిస్తూ ఉండగల్గుతున్నాము. జాగృతియే జీవిత పథం. అలా ఉంటే గురువు మనలను సత్యంలో జాగృతపరుస్తాడు. అప్పడు మనం చిరంజీవులమౌతాము. నిజం చెప్పాలంటే లోకం వల్ల ఎప్పడూ సమస్యరాదు. ఆత్మను మరిచిపోవటమే మన సమస్యకు మూలకారణం. గురువు శుద్ధాతి శుద్ధుడు. ఇది సనాతన ధర్మం. "ఏసధమ్మోసనంతనో" ఇదే సత్యం, ధర్మం, శాశ్వతం. ఇదే అవ్యయమైన ధర్మం. అట్టి గురువు సామీప్యంలో మనం శాశ్వతసత్యంలో ఉండటానికి అర్హులమౌతాము. మూర్ఖుడు నిర్లక్ష్యంగా ఉంటాడు. కాని గురువు తనను సమీపించిన సాధకునకు మార్గదర్శి అవుతాడు. అది సాధకునకు అమూల్యనిధి. గురువులేని మూఢుని జీవితం అయోమయం, తికమక, ప్రమాదాల్లో జీవిస్తాడు. స్మృతి లేదు. గుంపులను అనుసరిస్తాడు. ఆతని వేషభాషలు అతనికి ఉన్న తెలివి అతనిదికాదు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పూజార్లు నేర్పినవి ఆతను అన్ని రకాల సూచనలను అనుసరిస్తాడు. తను ఎక్కడ ఎందుకు ఉన్నాడో దేన్ని సాధించాలి అనేది తెలియదు. జోతిష్కుల సమాధానాలను సులువుగా నమ్మేస్తాడు. సంశయించడు నీడలను పట్టుకొంటాడు నిజాన్ని వదిలేస్తాడు. గుర్జిఫ్ "నీవు నమ్మకాలు అనే మనస్సు జైలులో ఉన్నావు. అది జైలు కాదనే మోహంలో ఉన్నావు అందుండి బయటపడాలనే సంకల్పం లేదు. ఆ జైలును అలంకరించుకొంటూ ఇతరుల జైలు గదులతో పోల్చుకొంటావు. అందుండి బయటపడాలి అంటే సామీప్యంలో ఉన్న గురువు సహకరించవలసి ఉంది" అన్నారు. గురువు రక్షణలో ఉన్న సాధకుని దారి తప్పిన ఆలోచనలను మార్గదర్శకత్వం వహిస్తాడు. తప్పదోవలో పోవటానికి అనుమతించడు వాటిని సత్యం వైపుకు మళ్ళిస్తాడు. అందుకనే గురువును శరణు వేడుకోవాలి. విశ్రాంతి పొందుతూ గురువు జాగృతిని రుద్దుకోవాలి. ఆయన మంగళకరమైన ఆలోచనల సుగంధాన్ని పరివేష్టించనియ్యాలి అప్పడు మనం సత్యంలో జాగృతమవ్వటానికి ఎంతోకాలం పట్టదు. సత్యదర్శనానికి పవిత్రత, నిరాడంబరం, ఔదార్యం కావాలి. వేమన "తనివి తీర గురుని ధ్యానించి మదిలోన; దనువు మరచి గురుని దాకినప్పడే; తమురుకొని వచ్చు బ్రహ్మతత్త్వము" అన్నారు. గీతలో పరమాత్మ "మూఢులు నిరాకారినైన నన్ను ఈ నిర్దుష్ట శరీరంలో ఇమిడి ఉన్నానని అనుకొంటారు. సాటిలేని దివ్యశక్తిని నేను సృష్టించిన "మాయ" కారణంగా ప్రతీవ్యక్తి నా నిజరూపాన్ని తెలుసుకోలేడు. జనన మరణాలకు అతీతమైన నా నిజలక్షణాలను ఈ మాయాపూరిత లోకం తెలుసుకోలేదు. ఈ సృష్టి అంతా నా వల్లనే పోషించబడుతున్నది. నేను మానవ శరీరం దాల్చాను కనుక మామూలు మానవుడిగానే భావిస్తారు అంటూ నాకు జ్ఞానికి (గురువుకు) తేడా లేదు" అన్నారు. కాబట్టి గురువు సాక్షాత్తు పరబ్రహ్మం అని ఆ పరమాత్మ స్థితి గురువులో ఉందని తేడాలేదని గుర్తించిన పుణ్యచరితుల జీవితాలు సార్థకమౌతాయి. దీనికి శ్రద్ధ వినయం త్రికరణశుద్ధి అత్యవసరం. ధనమదం ఉన్నవారు గురు సుగంధాన్ని అందుకోవటం కష్టం. వారు గురువునే తన స్వాధీనంలో ఉండాలనుకొని ప్రయత్నిస్తారు. వంచిస్తారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**